# కృష్ణా నదీజలాల పునః పంపిణీ జరగకుండా మహబూబ్‌నగర్ కరువు తీరుతుందా?

**కృష్ణానది ఈ జిల్లాకు స్వతస్సిద్ధమైన వనరు. ఆ నది నీటిలో న్యాయబద్ధమైన వాటా మహబూబ్‌నగర్‌కు అందినట్టయితే వర్షాభావం ఉన్న సంవత్సరాలలో కూడా పరిమితమైన కరువుతో ఈ జిల్లా తప్పించుకోగలుగుతుంది.**

ఎప్పుడూ కరువు ఉండే ప్రాంతాలలోనే కాక రాష్ట్రమంతటా హెచ్చుతగ్గులుగా ఈ సంవత్సరం కరువు ఉండడం వల్ల 'కరువు సమస్య' అన్నిచోట్లా చర్చకు వస్తున్నది. పత్రికలూ ఇతర ప్రసార సాధనాలూ కరువును ఒక ప్రధాన విషయంగా చర్చిస్తున్నాయి.

అంతవరకు మంచిదే. కానీ దినపత్రికలలో కరువు గురించి రాస్తున్న వారు గతంలో ఆ విషయాన్ని పట్టించుకున్నవారు కాకపోవడం వల్ల వారు చేస్తున్న చర్చ దుర్భర పరిస్థితుల వర్ణనను దాటిపోవడం లేదు.

కరువంటే వర్షాభావం కాదు. కరువంటే నీటి ఎద్దడి. మొక్కలకూ మనుషులకూ పశువులకూ కావలసినంత నీరు దొరకకపోవడం కరువు. వర్షపాతంలో లోటు దానికి ఉండగల ఒకానొక కారణం మాత్రమే. వర్షం ఎక్కువ పడినా అది అకాల వర్షమో అకస్మాత్తు వర్షమో అయితే కరువును తప్పించు కోలేకపోవచ్చు. వర్షం తక్కువ పడినా నీటివనరుల సమర్థ వినియోగం అలవరచుకున్న చోట కరువును తప్పించుకోవచ్చు. వర్షాభావం ఉన్న సంవత్సరాలలో నీటి కొరతకు గల ఇతర కారణాలు ఒకదానికొకటి తోడయి కరువును పెంచుతాయనేది సత్యమే. కానీ వర్షాభావమే కరువుకు కారణం కాదు.

మహబూబ్‌నగర్ జిల్లాలోనూ దీనికి పొరుగున ఉన్న నల్లగొండ, రాయలసీమ జిల్లాలోనూ కరువు నిత్యం ఉంటుంది. వాతావరణ నిపుణులు రుతుపవనాలు సకాలంలో వచ్చి సమృద్ధిగా వాన కురిపించాయని ప్రకటించిన సంవత్సరాల లోనూ కరువు ఉంటుంది, లేని సంవత్సరాలలోనూ ఉంటుంది. లేని సంవత్సరాలలో కొంచెం ఎక్కువ ఉంటుందంతే. 'కరువు ప్రాంతాలు'గా పేరుగాంచిన అన్ని ప్రాంతాలకూ ఇదే వర్తిస్తుంది.

ఇక్కడ కరువు ఒక వ్యవస్థ, వైపరీత్యం కాదు. సగటు పరిస్థితి, విపరీత పరిస్థితి కాదు. పనులు దొరకక వలస పోవడం, పశువులకు మేత దొరకక కోతకు తోలడం, మంచినీటి కోసం మైళ్లకు మైళ్లు తిరిగిరావడం ఇక్కడ నిత్యజీవిత పరిస్థితులు.

దీనికి పరిష్కారం దొరకాలంటే వానదేవుడిని తిట్టుకునీ ప్రయోజనం లేదు, పూజలూ యాగాలూ చేసే ప్రయోజనం లేదు. పూజల వల్ల వర్షం కురుస్తుందని ఒకవేళ మనం నమ్మినా అది కురిసిన సంవత్సరం కూడా ఇక్కడ కరువే కాబట్టి వాటివల్ల ప్రయోజనమేమీ లేదు.

మనకు అందుబాట్లో ఉన్న నీటి వ్యవస్థను ఎంత న్యాయంగా, ఎంత సమర్థంగా వాడుకుంటున్నామన్నది మనం చూడవలసిన విషయం. పరిగెత్తే నీటికి నడక నేర్పించాలనీ కురిసేవాన మొత్తం భూగర్భ జలాలలోని చేరి బావుల ఊట పెంచేటట్టు చూడాలనీ మన ముఖ్యమంత్రి మనల్ని ఊరికే ఊదరగొడుతుండడం వల్ల భూగర్భ జల వ్యవస్థ గురించి మాత్రం కొంచెం అవగాహన పెరిగింది.

కానీ మన ప్రభుత్వం అదొక్కటి మాత్రమే ఎందుకు మాట్లాడుతుంది? వర్షం నేలమీద మాత్రమే కురవదు. వాగులలో, వంకలలో, కుంటలలో, చెరువులలో, నదులలోనూ కురుస్తుంది. వీటన్నిటినీ 'ఉపరితల జలవనరులు' అంటారు. భూగర్భ జల వ్యవస్థ గురించి ఎంతగా ఆలోచించాలో, ఉపరితల జల వ్యవస్థ గురించి కూడ కనీసం అంతగానైనా ఆలోచించాలి కదా! ప్రభుత్వం ఆలోచించకపోతే మనమైనా ఆలోచించాలి కదా!

మహబూబ్‌నగర్‌నే తీసుకున్నట్టయితే కృష్ణానది ఈ జిల్లాకు స్వతస్సిద్ధమైన వనరు. ఆ నది నీటిలో న్యాయబద్ధమైన వాటా మహబూబ్‌నగర్‌కు అందినట్టయితే వర్షాభావం ఉన్న సంవత్సరాలలో కూడ పరిమితమైన కరువుతో ఈ జిల్లా తప్పించుకోగలుగుతుంది.

మహబూబ్‌నగర్‌కు ప్రధానంగా వర్తించే ఈ విషయం నల్లగొండకూ రాయలసీమ జిల్లాలకూ కూడా వర్తిస్తుంది. అయితే చారిత్రకంగా నెలకొన్న చేదు వాస్తవమేమిటంటే కృష్ణానదీ జలాలలో పెద్ద వాటా దిగువన ఉన్న సర్కారు జిల్లాలు తీసుకుంటున్నాయి. అక్కడ సగటు వర్షపాతం ఇక్కడికంటె బాగా ఎక్కువ. కాబట్టి నేలలో తేమ ఎక్కువ, భూగర్భ జలాలు ఎక్కువ, 'నీటికి నడక నేర్పించినట్ట'యితే భూగర్భ జలాలను పెంపొందించుకునే అవకాశమూ ఎక్కువ.

ఆ ప్రాంతానికే నదీ జలాలలో పెద్ద వాటా ఇచ్చి వర్షపాతం తక్కువ ఉన్న జిల్లాలను ఎండబెట్టడం సమైక్య ఆంధ్రలో యాభై ఏళ్లుగా జరిగిన వంచన.

దీనిని గురించి మాట్లాడకుండా కరువు సమస్య గురించి మాట్లాడగలమా? తరలిపోతున్న కూలిజనం ఫోటోలు, బక్కచిక్కిన పశుగణం చిత్రాలు ఎన్ని ప్రచురించినా కరువు సమస్యను పూర్తిగా చూపించినట్టవుతుందా? కృష్ణా నదీ జలాల అసమాన పంపిణీని అంతమొందించడం కరువు సమస్య పరిష్కారానికి ఒక ముఖ్య సాధనం అని ప్రకటించకుండ కరువు చర్చను ముగించగలమా?

ఇది ఆకలి దప్పుల చర్చ మాత్రమే కాదు, జీవన్మరణ సమస్య. ఈ సంవత్సరం మే నెల మొదటి వరకే మహబూబ్‌నగర్ జిల్లాలో 28 మంది తిండిలేక చనిపోయారు. కరువు వ్యవసాయం బరువు తట్టుకోలేక ఆత్మహత్య చేసుకున్న వారినీ, తిండిలేక ఒంట్లో సత్తువ లేక వడదెబ్బకు చనిపోయిన వారినీ, తిండి కోసం దూర ప్రాంతం కూలీలుగా వలసపోయి దిక్కులేని మరణం పాలయిన వారినీ కూడ లెక్కపెట్టుకుంటే ఈ సంవత్సరం కరువుకు ప్రత్యక్షంగానో పరోక్షంగానో మహబూబ్‌నగర్ జిల్లా వాసులు వంద మందిదాకా బలి అయి ఉంటారు.

పరిస్థితి ఇంత ఘోరంగా ఉన్నా మన రాష్ట్ర ప్రభుత్వం కృష్ణా నదీ జలాల పునః పంపిణీ సంగతి అటుంచి, అనుమతి పొందిన ప్రాజెక్టుల విషయంలో సహితం వివక్షను విడిచిపెట్టడం లేదు. మేనెల మొదటి వారంలో చంద్రబాబు నాయుడు కృష్ణా జిల్లా నందివాడలోనూ, మహబూబ్‌నగర్ జిల్లా మక్తల్‌లోనూ కృష్ణా నదీ జలాల ప్రాజెక్టుల గురించి ఉపన్యసించాడు. అక్కడ పులిచింతల గురించి, ఇక్కడ భీమా గురించి మాట్లాడాడు. ఇవి రెండూ ఒకే ప్రాతిపదికన నికరమైన నీటి కేటాయింపు పొందిన ప్రాజెక్టులు. మొదటిది సంపన్నమైన కృష్ణా డెల్టా స్థిరీకరణ కోసం ఉద్దేశించిన ప్రాజెక్టు కాగా, రెండవది కరువు పీడిత మహబూబ్‌నగర్ ప్రజలకు ప్రాణం పోయడం కోసం రూపొందించిన ప్రాజెక్టు. అయితే నందివాడలో మాట్లాడుతూ పులిచింతలను 'త్వరలోనే' పూర్తిచేస్తానని హామీయిచ్చిన ముఖ్యమంత్రి భీమా గురించి మాట్లాడేటప్పుడు ప్రాజెక్టుకు నిధులు సేకరించే ప్రయత్నంలో ఉన్నామని ఆశ చూపిస్తూ (పులిచింతలకు ఉన్న నిధులు భీమాకు ఎందుకు లేకుండా పోయాయో!) భీమా ప్రాజెక్టులో ఒక భాగంగా చూపించబడుతున్న 15 వేల ఎకరాల ఆయకట్టు గల 'సంగంబండ రిజర్వాయరు' పరిపూర్తి గురించి మాత్రమే హామీ యిచ్చాడు. సంగంబండ రిజర్వాయర్‌ను అక్కడికే పరిమితం చేస్తే ఇంక భీమా ప్రాజెక్టు అనేదేదీ ఉండదని ముఖ్యమంత్రికి తెలియదనుకోవాలా?

ఇప్పుడు అమలవుతున్న ఈ వివక్ష నుంచి రేపు జరగవలసి ఉన్న పునఃపంపిణీ దాకా అన్ని విషయాలూ చర్చించుకుందాం రమ్మని ఆహ్వానిస్తూ...

12.05.2003 **– కృష్ణా నదీ జలాల పునఃపంపిణీ ఉద్యమం**

# సదస్సు

## కరువు సమస్య - కృష్ణా నదీజలాల పునః పంపిణీ

**మేనెల 16వ తేదీ మహబూబ్‌నగర్ జిల్లా మక్తల్‌లోని మార్కెట్‌యార్డ్**

(నెహ్రూగంజ్)లో

ఉదయం 10.30 గంటల నుంచి

సాయంత్రం 5.00 గంటల వరకు